సాక్షి చిత్తూరు

మంగళవారం । 10 । సెప్టెంబర్ । 2024



మామిడికి యాజమాన్య రక్షణ
మామిడి పంటలో యాజమాన్య పద్ధతులు తప్పనిసరిగా పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు. - 8లో



కబేళాలలో కాసుల వర్షం
అధికార పార్టీ అండతో లేగదూడలను కబేళాలకు తరలిస్తున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. - 8లో



మెనూలో మార్పులు..
మధ్యాహ్న భోజన మెనూలో మార్పులకు తగిన సూచనలు ఇవ్వాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ అధికారులను కోరారు. - 8లో

న్యూస్‌రీల్

రేపు విద్యుత్ గ్రీవెన్స్

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో బుధవారం విద్యుత్ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో ఎస్‌ఈ సురేంద్రనాయుడు తెలిపారు. అన్ని ఈఈ కార్యాలయాల్లో ఉదయం 11 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. వినియోగదారులు సమస్యలను తెలపాలని వివరించారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు అర్హత, ఆసక్తి ఉన్న వారు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా ఐసీడీఎస్ పీడీ నాగశైలజ వెల్లడించారు. ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడారు. జిల్లా ఐసీడీఎస్ శాఖ పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్తలు 6, మినీ కార్యకర్తలు 12, హెల్పర్లు 37, మొత్తం 55 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఈ పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఖాళీల వివరాలు సీడీపీఓ కార్యాలయాల్లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రం, గ్రామ, వార్డు సచివాలయ పరిధిలో ఉన్న స్థానిక వివాహితులు, పదవ తరగతి ఉత్తీర్ణత చెందిన వారు, రోస్టర్‌ను అనుసరించి సంబంధిత సీడీపీఓ కార్యాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ నెల 12వ తేదీ నుంచి ఈ నెల 21వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు సీడీపీఓ కార్యాలయాల్లో సంప్రదించాలని ఆమె కోరారు.

సర్దుబాటు టీచర్లు వెంటనే విధుల్లో చేరాలి



డీఈఓ దేవరాజు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఇటీవల నిర్వహించిన సర్దుబాటు ప్రక్రియలో ఉత్తర్వులు అందుకున్న టీచర్లు వెంటనే కొత్త స్థానాల్లో విధుల్లో చేరాలని డీఈఓ దేవరాజు ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు జిల్లాలోని గవర్నమెంట్, జెడ్పీ, ఎంపీపీ, మున్సిపల్ యాజమాన్యాల్లో పనిచేస్తున్న టీచర్లకు సర్దుబాటు ప్రక్రియ చేపట్టామన్నారు. ఈ ప్రక్రియలో మిగులు టీచర్లను అవసరమైన మేరకు సమీప పాఠశాలలకు సర్దుబాటు చేశామన్నారు. జిల్లాలో 464 మంది టీచర్లను సర్దుబాటు చేసినట్లు తెలిపారు. సంబంధిత టీచర్లను ఆయా మండలాల ఎంఈఓ లు, హెచ్‌ఎంలు వెంటనే రిలీవ్ చేయాలని ఆదేశించారు. సర్దుబాటు అయిన టీచర్లు కేటాయించిన పాఠశాలల్లో చేరకపోతే శాఖాపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. టీచర్ల బదిలీలు, డెప్యుటేషన్‌లపై నిషేధం ఉన్నట్లు తెలిపారు. డెప్యుటేషన్ల కోసం టీచర్లు డీఈఓకు దరఖాస్తు చేసుకోకూడదన్నారు. నిబంధనలను అతిక్రమించి దరఖాస్తులు చేసి ఒత్తిడి తీసుకొస్తే సంబంధిత టీచర్లపై శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని డీఈఓ హెచ్చరించారు.

ఏడు నియోజకవర్గాలకు నిధులు విడుదల



డ్వామా పీడీ రాజశేఖర్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు డ్వామా పరిధిలో నిధులు విడుదల చేసినట్లు డ్వామా పీడీ రాజశేఖర్ వెల్లడించారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా ఏడు నియోజకవర్గాల్లో ఇటీవల నిర్వహించిన గ్రామ సభల్లో ఆమోదించిన పనులకు బడ్జెట్ మంజూరు చేసినట్లు చెప్పారు. డ్వామా మెటీరియల్ కాంపోనెంట్ నిధులు రూ.90 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఆ నిధులతో సంబంధిత నియోజకవర్గాల్లో 1400 పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలోపు మంజూరైన పనులన్నింటినీ పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు, ఇతర పనులు చేపడుతారని డ్వామా పీడీ వెల్లడించారు.

పార్వతీ పుత్రా... ప్రణామం



స్వర్ణ మయూరంపై విహరిస్తున్న వినాయక స్వామి

- కాణిపాకంలో స్వర్ణ మయూరంపై వరసిద్ధుని కటాక్షం

కాణిపాకం: కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి బ్రహ్మోత్సవం అట్టహాసంగా సాగుతోంది. ఉత్సవాల్లో రెండో రోజు సోమవారం సిద్ధిబుద్ధి సమేత వినాయకుడు స్వర్ణ మయూర వాహనంపై మాడవీధుల్లో అంగరంగవైభవంగా ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. ఉదయం స్వామివారికి పంచామృత అభిషేకం, ప్రత్యేక పూజలు, అలంకరణలు చేశారు. అనంతరం నెమలి వాహన ఉభయదారులు ప్రత్యేకంగా క్షీరాభిషేకం, గంధాభిషేకం, కొబ్బరి నీళ్లతో అభిషేకం నిర్వహించారు. రాత్రి అలంకార మండపంలో శ్రీసిద్ధి, బుద్ధి సమేత స్వామివారి ఉత్సవమూర్తులను పట్టు పీతాంబరాలు, పరిమళభరిత పుష్పమాలికలు, విశేషాభరణాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ మూర్తులను ఉభయదారులు, ఆలయ అధికారులు భుజాలపై మోసుకుంటూ ఊరేగింపుగా తీసుకువచ్చి బంగారు మయూర వాహనంపై కొలువుదీర్చారు. మేళ తాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఆలయ పురవీధుల్లో స్వామివారు విహరించారు. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించారు. ఆస్థాన మండపంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

నేడు మూషిక వాహనం

కాణిపాకం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి మంగళవారం మూషిక వాహనంపై ఊరేగనున్నారు. ఉదయం అభిషేకం, రాత్రి మూషిక వాహనంపై విహరించనున్నారు. ఇందుకు కాణిపాకం, తిరువణంపల్లె, అగరంపల్లె, కాణిపాక పట్నం, వడ్రాంపల్లె, కొత్తపల్లె, చినకాంపల్లె గ్రామస్తులు విశ్వకర్మ వంశస్తులు ఉభయదారులుగా వ్యవహరించనున్నారని ఆలయ అధికారులు పేర్కొన్నారు.



కాణిపాకంలో కళాకారిణి నృత్య ప్రదర్శన



కూటమి ప్రభుత్వం ఏర్పాటైన రోజు నుంచి ఆ పార్టీ నేతలు అధికారాన్ని అడ్డు పెట్టుకుని వివాదాస్పద భూముల సెటిల్‌మెంట్లు, ఇసుక, మట్టి, గ్రావెల్, బడా వ్యాపారుల నుంచి వసూళ్లకు పాల్పడ్డారు. కూటమి నేతలు చెప్పింది వినకపోతే ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ లేదా మంత్రి లోకేష్ బాబు పేర్లు చెప్పి దందాలు చేస్తున్నారు. ఆ దందాల పరంపర ఇప్పుడు తిరుపతి, చిత్తూరు జిల్లాలోని మద్యం బార్లు, వైన్ షాపుల వైపు మళ్లించారు. ఆయా బార్ల యజమానులు, నిర్వాహకులతో పలుమార్లు సమావేశాలు నిర్వహించి ఎవరెవరు.. ఎంతెంత ఇవ్వాలో నిర్ణయించారు.

వసూళ్ల సేన

- ఎన్నికల్లో ఖర్చు చేశాం.. లాభాల్లో వాటా ఇవ్వాలంటూ హుకుం
- బార్లు, వైన్ షాపుల నుంచి వసూళ్లకు కూటమి నేతల ప్లాన్
- ఇవ్వకుంటే పోలీసు కేసులు
- డీల్ చేస్తున్న ఓ డీఎస్పీ
- తిరుపతి జనసేన ముఖ్యనేత నివాసంలో నాయకుల సమావేశంలో నిర్ణయం

సాక్షి ప్రతినిధి, తిరుపతి : దోచుకోవడానికి కాదేదీ అనర్హం అన్నట్లు కూటమి నేతలు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రకృతి సంపదను దోచుకుంటున్నారు. ఇప్పుడు మరో కొత్త దందాకు సిద్ధమయ్యారు. ఎన్నికల్లో ఖర్చు చేశామని బెదిరిస్తూ వైన్ షాపులు, బార్ల నుంచి వసూళ్లు చేసుకునేందుకు ప్లాన్ వేశారు. తాజాగా సోమవారం తిరుపతిలో జనసేన ముఖ్య నేత నివాసంలో వారు నిర్వహించిన అత్యవసర సమావేశమే ఇందుకు నిదర్శనం. తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో స్టార్ హోటళ్లతో కలిపి మొత్తం 44 బార్లు ఉండగా, ఒక్క తిరుపతి నగరంలోనే 22 బార్లు ఉన్నాయి. మద్యం అమ్మకాలు జరిగేది కూడా తిరుపతి నగరంలోనే. దీంతో తమకు వాటా ఇవ్వాలని టీడీపీ, జనసేన నేతలు బార్ల యజమానులపై ఒత్తిడి చేశారు. ఎవరూ స్పందించకపోవడంతో నగరంలోని ఓ డీఎస్పీని రంగంలోకి దింపారు. బార్ల నిర్వహణ, అమ్మకాల్లో లోపాలు ఉన్నాయంటూ కేసులు పెడుతామని బెదిరింపులకు దిగారు. ఐదేళ్ల పాటు సజావుగా నడుస్తున్న వ్యాపారంలో ఇప్పుడు ఇబ్బందులు తప్పేలా లేవని గ్రహించిన బార్ల యజమానులు తిరుపతి నగరంలోని జనసేన పార్టీ ముఖ్యనేతను ఆశ్రయించారు. ఆయన తన కుమారుడితో పాటు తన అన్న కుమారుడిని, వారికి తోడుగా తిరుపతి రూరల్ మండలానికి చెందిన టీడీపీ నేతను రంగంలోకి దింపారు. సదరు టీడీపీ నేత ఓ బార్‌కు యజమాని కావడం గమనార్హం.

కార్యకర్తల పేరిట వసూళ్లు చేసేలా..

నేరుగా తాము డబ్బులు వసూళ్లు చేస్తే ఏదో ఒక రోజు అభాసుపాలవుతామని భావించిన ఉమ్మడి పార్టీ నేతలు తమ పార్టీ కార్యకర్తలను ముందుంచారు. విషయం బయటపడినా వారిపైకి నెట్టవచ్చులే అనేది వారి ప్లాన్. అందులో భాగంగా ఐదుగురు నాయకులకు, నమ్మకస్తులైన మరో ఐదుగురి కార్యకర్తలకు వసూళ్ల బాధ్యతను అప్పగించినట్లు సమాచారం. ఈనెల 15వ తేదీలోపు మొదటి ఇన్‌స్టాల్‌మెంట్ ఇచ్చేయాలని నిర్ణయించారు. వచ్చే నెల నుంచి ఒకటి నుంచి ఐదోతేదీలోపు అనుకున్న మొత్తాన్ని ఇవ్వాలని తేల్చిచెప్పారు. చేసేదేమీ లేక బార్ల యజమానులంతా ఒప్పుకున్నారు.

మామూళ్లివ్వకుంటే బడిత పూజే..

అక్రమ వసూళ్ల కోసం ఓ బార్ యజమానికి పూర్తి బాధ్యతలు అప్పగించడంతో అతని బెదిరింపులకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. ఎన్నికల్లో రూ.కోట్లు ఖర్చు చేసి తమ నాయకుడిని గెలిపించుకున్నామని, వ్యాపారం సజావుగా సాగాలంటే.. అడిగినంత ఇవ్వాల్సిందేనంటూ హుకుం జారీ చేశారు. తాను నేరుగా సీఎం, ఉపముఖ్యమంత్రి, మంత్రి లోకేష్‌తో మాట్లాడుతానని చెప్పుకొచ్చారు. తాము అడుగుతున్నా స్పందించకపోవడంతోనే పోలీసులు రంగంలోకి దిగారని గుర్తుచేశారు. అడిగినంత ఇస్తే.. రాత్రి వేళ ఎంత టైం అయినా బార్లు బార్లా తెరుచుకోవచ్చిన హామీ ఇచ్చారు. దీంతో బార్ల యజమానులు ఒప్పుకోక తప్పలేదు. బార్ అండ్ రెస్టారెంట్‌కు ఓ రేటు, స్టార్ హోటళ్లలో నిర్వహించే బార్లకు మరో రేటు నిర్ణయించారు. ప్రతి బార్ నుంచి నెలకు రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షలు ఇవ్వాలని హుకుం జారీ చేశారు. అంత ఇచ్చుకోలేమని ఎంత బతిమాలినా వినిపించుకోలేదని సమాచారం. అయితే ఈ విషయం గోప్యంగా ఉంచడంతో పాటు టీడీపీ, జనసేనకు చెందిన ఐదుగురు నాయకులు సోమవారం జరిగిన సమావేశంలో ఓ నిర్ణయానికి వచ్చారు.

గంగ ఒడికి గణపయ్య



వి.కోట: నిమజ్జనానికి ర్యాలీగా బయల్దేరిన గణపయ్యలు

వినాయక చవితిని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా గణపయ్యను కొలువుదీర్చారు. మూడు రోజుల పాటు ఆయనకు ప్రీతిపాత్రమైన ఉండ్రాళ్లతోపాటు పిండి వంటలు, ఫలహారాలు నైవేద్యంగా సమర్పించారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మూడో రోజు బొజ్జ గణపయ్యను ఊరేగింపుగా గంగ ఒడికి తరలించారు. జై గణేశా.. బైబై గణేశా అంటూ నినదించారు. చిత్తూరు, పూతలపట్టు, బంగారుపాళెం, పలమనేరు, వి.కోట. పుంగనూరు పట్టణాల్లో సోమవారం వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు.

– కాణిపాకం





చిత్తూరు: కట్టమంచి మండపం నుంచి నిమజ్జనానికి రిక్షాలో తరలిపోతున్న గణపయ్య

13న జాబ్ మేళా

కార్వేటినగరం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఈనెల 13న నిర్వహించనున్న జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ గణేష్ తెలిపారు. ఐటీఐ కళాశాలలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కల్పనా కార్యాలయం, డీఆర్‌డీఏ వారు సంయుక్తంగా స్థానిక ఐటీఐ ఆవరణలో జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు తెలిపారు. జాబ్‌మేళాకు ర్యూన్సన్ ప్రైవేటు లిమిటెడ్, ముతూట్ ఫైనాన్స్ పాల్గొంటాయని చెప్పారు. 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ లేదా డిగ్రీ పాస్, ఫెయిల్ అయిన 18 నుంచి 35 ఏళ్ల లోపువారు జాబ్ మేళాలో పాల్గొన వచ్చన్నారు. ఇతర వివరాలకు 81425 09017ను సంప్రదించాలని కోరారు.

వరసిద్ధునికి కూరగాయల వితరణ



కూరగాయలతో దాతలు

కాణిపాకం: కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలోని నిత్య అన్నదానానికి పలువురు దాతలు సోమవారం రెండు టన్నుల కూరగాయలను అందజేశారు. శాంతిపురానికి చెందిన శ్రీనివాసులు, సురేష్ బృందం కూరగాయలను ఆలయ అధికారుల సమక్షంలో అన్నదానానికి అందించారు. అనంతరం వారికి స్వామి దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో ధనంజయ్య, సూపరిటెండెంట్ రంగస్వామి పాల్గొన్నారు.

ఆటస్థలం లేని బడులు తెలపండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఆటస్థలాలు లేని బడుల వివరాలు సేకరించాలని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు ఇచ్చిన ఉత్తర్వులు సోమవారం డీఈఓ కార్యాలయానికి చేరాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్యాల పరిధిలో ఆటస్థలాలు లేని పాఠశాలల జాబితాను సేకరించి పంపాలంటూ పేర్కొన్నారు.

లంచం అడిగితే వేటు ఖాయం

- జిల్లాకు రెండు కేంద్రీయ విద్యాలయాలు మంజూరు
- శాఖల్లో ఈ ఆఫీస్ ఫైల్స్ పెండింగ్ ఉండడానికి వీల్లేదు
- విలేకరులతో కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ శాఖల్లో అధికారులు, సిబ్బంది లంచం అడిగితే వేటు ఖాయమని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ హెచ్చరించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను వివరించారు. వి.కోట ఘటన పునరావృతం కాకుండా జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి పెడుతోందన్నారు. విజయవాడ వరద బాధితులకు సహాయం చేసేందుకు పారిశ్రామికవేత్తలు, ఎన్జీఓలు, ఉద్యోగులు ముందుకు వచ్చి సహాయం అందించాలని పిలుపునిచ్చారు. ఈ నెల 10వ తేదీన కలెక్టరేట్‌లో వరదబాధితుల సహాయార్థం ప్రత్యేక కౌంటర్‌ను ప్రారంభిస్తామని వెల్లడించారు.

రెవెన్యూ శాఖలో ప్రక్షాళన

ప్రస్తుతం నిర్వహించనున్న బదిలీల్లో రెవెన్యూ శాఖను ప్రక్షాళన చేయనున్నట్లు తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్, ఆర్‌ఐ, వీఆర్‌ఓలను తప్పనిసరిగా కొత్త ప్రాంతాలకు బదిలీ చేస్తామని తెలిపారు. ఇతర జిల్లాలకు మ్యూచువల్ ఉంటేనే బదిలీ చేయనున్నట్లు స్పష్టం చేశారు. సచివాలయ ఉద్యోగుల బదిలీలను నిబంధనల ప్రకారం చేపడుతామన్నారు. బదిలీల్లో ఇతర జిల్లాలకు సంబంధించి స్పెషల్ కేటగిరీలకు ప్రాధాన్యతనిస్తామని తెలిపారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

త్వరలో ప్రభుత్వ షెడ్యూల్‌ను బట్టి జిల్లాలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామన్నారు. జిల్లాలో సీసీ రోడ్లు, అనిమల్ షెడ్స్, తదితర పనులకు రూ.90 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. అక్టోబర్ 15 నుంచి 23 వరకు జిల్లాలోని రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో దివ్యాంగులకు మెగా క్యాంపులను నిర్వహిచనున్నట్లు వెల్లడించారు. చిత్తూరు–తచ్చూరు, నేషనల్ హైవే లో భూ నిర్వాసితులకు అందాల్సిన నష్టపరిహారాన్ని త్వరితగతిన అందజేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. చిత్తూరు ఆర్డీఓ కార్యాలయం పరిధిలో సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

జిల్లాకు రెండు కేంద్రీయ విద్యాలయాలు

జిల్లాకు నూతనంగా రెండు కేంద్రీయ విద్యాలయాలు మంజూరైనట్లు చెప్పారు. చిత్తూరు, కుప్పంలో కేంద్రీయ విద్యాలయాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి కేంద్రీయ విద్యాలయాల్లో తరగతులు ప్రారంభం అవుతాయని తెలిపారు. ఇటీవల కుప్పంలో స్పెషల్ ఐ క్యాంప్ నిర్వహించి 4500 మందికి ఈ నెలలో ఉచితంగా కళ్లద్దాలు, 1200 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్ చేయించనున్నట్లు చెప్పారు. ఉపాధి హామీ పథకంలో జిల్లాలో రూ.130 కోట్ల వరకు నిధులు మంజూరు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. ఎంపీ ల్యాడ్స్‌లో గతంలో మంజూరు చేసి పూర్తి కాని పనులకు అనుమతులు ఇవ్వనున్నట్లు చెప్పారు. మైక్రో ఇరిగేషన్‌లో 24 వేల హెక్టార్లు నమోదైనట్లు తెలిపారు. రూ.10 కోట్లు హార్టికల్చర్ అభివృద్ధికి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు.

లంచం అడిగితే వేటు తప్పదు

జిల్లాలోని అన్ని శాఖల అధికారులు నిస్వార్థంగా ప్రజలకు సేవలందించాలన్నారు. ఎవరైన లంచం అడిగితే వేటు తప్పనిసరిగా ఉంటుందని హెచ్చరించారు. కలెక్టరేట్‌లో ఫైల్స్ ఎక్కువగా పెండింగ్ ఉండేవని, వాటిని పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. రెవెన్యూ శాఖ పరిధిలో ఆర్డీఓ, తహసీల్దార్, కలెక్టరేట్‌లోని అన్ని విభాగాల్లో, ఇతర శాఖల్లో ఫైల్స్ పెండింగ్ లేకుండా క్లియర్ చేయాలని అధికారులను ఆదేశించినట్లు కలెక్టర్ వెల్లడించారు.

క్లుప్తంగా

భజన మందిరం దగ్ధం


కాలిపోయిన మందిరం

గుడుపల్లె: విద్యుదాఘాతంలో భజన మందిరం దగ్ధం కావడంతో రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లిందని గ్రామస్తులు పేర్కొన్నారు. మండలంలోని దిగువచిగర్లపల్లెలోని భజన మందిరంలో వెంకటేశ్వర స్వామి చిత్ర పటాలు ఏర్పాటు చేశారు. ఈ చిత్ర పటాలకు రంగురంగుల బల్బులతో కూడిన విద్యుత్ అలంకరణ ఏర్పాటు చేశారు. ఆదివారం రాత్రి హఠాత్తుగా, విద్యుత్ తీగలతోపాటు భజన మందిరం పూర్తిగా దగ్ధమైపోయినట్లు తెలిపారు.

వ్యక్తి మృతికి కారణమైన నిందితుడికి జైలు


పోలీసుల అదుపులో ఉన్న నాగరాజు

చిత్తూరు అర్బన్: ఓ వ్యక్తి మృతికి కారణమైన నిందితుడికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ చిత్తూరులోని అడిషనల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు సోమవారం తీర్పునిచ్చింది. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ స్వాతి కథనం మేరకు.. తమిళనాడులోని తిరువణ్ణామలైకు చెందిన నాగరాజు (38) చిత్తూరు నగరంలోని కామేశ్వర్‌నగర్‌లో పునరావాస కేంద్రాన్ని నడుపుతున్నాడు. మద్యానికి అలవాటుపడ్డ వారిని, ఆ వ్యసనం నుంచి బయటపడేయడమే ఆ పునరావాస కేంద్రం లక్ష్యం. ఇందుకోసం డబ్బులు కూడా వసూలు చేస్తారు. చిత్తూరు నగరంలోని శ్రీనివాసనగర్ కాలనీకు చెందిన ఆశ అనే మహిళ తన కుమారుడు తరుణ్‌ను పునరావాస కేంద్రంలో చేర్పించారు. తండ్రి చనిపోవడంతో ఆ బాధలో తరుణ్ మద్యానికి అలవాటుపడ్డాడు. దాన్ని మాన్పించడానికి అతని తల్లి ఇక్కడ చేర్పించి, డబ్బులు చెల్లించారు. అయితే 2022 డిసెంబరు 14న తరుణ్ పునరావాసకేంద్రంలో అనుమాస్పద రీతిలో చనిపోయాడు. తన బిడ్డకు సరైన వైద్యం, తిండి అందించకపోవడంతోనే చనిపోయినట్లు ఆశ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై అప్పటి చిత్తూరు వన్‌టౌన్ సీఐ నరసింహరాజు కేసు నమోదుచేసి నాగరాజును అరెస్టుచేసి కోర్టుకు తరలించారు. నేరాభియోగం రుజువుకావడంతో నిందితుడికి అయిదేళ్ల జైలుశిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి వెన్నెల తీర్పునిచ్చారు.

మామిడికి యాజమాన్య రక్షణ

మామిడిలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 2.65 లక్షల ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. జిల్లాలో ప్రధాన పంటల్లో మామిడి ఒకటి. వర్షాకాలంలో మామిడి తోటలను రక్షించుకోవాల్సి ఉంది. ఇందుకు అనుగుణంగా ఉద్యానవన శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో తోటలను పరిశీలించి రైతులకు తగు సూచనలు ఇస్తున్నారు. వర్షాకాలంలో మామిడిని ఆశించే గూడు పురుగు, కాండం తొలిచే పురుగులతో పాటు గమ్మోసిస్ బంక నుంచి తోటల రక్షణ, అధిక దిగుబడులకు చేపట్టాల్సిన సస్య రక్షణ పద్ధతుల గురించి ఇలా వివరించారు. ఇందుకు అనుగుణంగా నేటి ప్రభుత్వం రైతులకు తగిన సహాయ సహకారాలు అందించాల్సి ఉంది.

- ఉమ్మడి జిల్లాలో 2.65 లక్షల ఎకరాల్లో తోటలు
- ఖరీఫ్‌లో కాండం తొలిచే పురుగు నివారణకు చర్యలు
- సేంద్రియ ఎరువుల వినియోగం మేలు
- సూచనలు పాటించాలంటున్న ఉద్యానవన అధికారులు


పుత్తూరులో రైతులకు సూచనలు ఇస్తున్న ఉద్యానవన శాఖ అధికారులు (ఇన్‌సెట్) తెగులు ఆశించిన మామిడి చెట్టు



తెగులుతో దెబ్బతిన్న చెట్టు, గూడు పురుగు

పుత్తూరు: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో అడప దడపా వర్షాలు కురుస్తుండడంతో తోటల్లో చెట్ల చుట్టూ పాదులు చేసి పశువుల ఎరువు, వేపపిండి గానుగ చెక్క వంటి సేంద్రియ ఎరువులను విధిగా వినియోగించాలి. వీటితో యూరియా, నత్రజని భాస్వరం పొటాషియం వంటి ఎరువులను చెట్టు చుట్టూ వేసి మట్టి కప్పాలి. చెట్టు పైనుంచి ఎండు పుల్లల్ని తొలగిస్తూ, కొమ్మలను రంపంతో కోయడం వలన వెలుతురు, గాలి చెట్లకు వస్తుంది. పిట్టలు మామిడి కొమ్మలపై రెట్ట వేయడం ద్వారా అనుకూల పరిస్థితుల్లో మొలకెత్తుతాయి. ఇలా మొలకెత్తిన కొమ్మలోని ఆకులు ఇంచుమించు మామిడి ఆకుల్లా కొంచెం పొడవుగా వుంటాయి. ఇలా పెరిగే కొమ్మ అసలు మామిడి చెట్టు నుంచి పోషకాల్ని గ్రహించడం ద్వారా క్రమేపి చెట్టు చివర్ల నుంచి కిందకు ఎండిపోతూ వస్తుంది. ఈ సమయంలో మొక్కతో సహా ఒక అంగుళం వరకు నరికి తొలగించాలి. నరికిన చోట బోర్డ్ పేస్ట్ పూయాలి. ఇదే సమయంలో పాదుల్లో సేంద్రియ ఎరువులతో పాటు ట్రైకోడెర్మావిరిడ్ మందును వేయాలి. తెగులు, పురుగుల మూలజీవులకు ఆశ్రయమిచ్చే మొక్క భాగాలను గుర్తించి తగిన సస్య రక్షణ చేపట్టాలి. తెగుళ్ల నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ మందుతోపాటు వేపనూనె కలిపి చెట్టు మొదళ్లను తాపడంతో పాటు, ఈ మిశ్రమాన్ని చెట్ల చిగురాకులపై పిచికారి చేయాలి. భూసారాన్ని, మిత్ర జీవులను పెంచే జనుము, అలసంద, ఉలవ, వినుము, జీలుగ వంటి అంతర్ పంటలను సాగుచేయాలి. ఇలా చేయడం వల్ల తోటలు ఆరోగ్యవంతంగా ఉంటూ అధిక దిగుబడులను ఇస్తాయి.

విస్తారంగా మామిడి తోటలు

చిత్తూరు జిల్లాలో 1.93 లక్షల ఎకరాలతో పాటు తిరుపతి ఉద్యానవన శాఖ పరిధిలో 72 వేల ఎకరాలతో కలిపి మొత్తం 2.65 లక్షల ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. ఏటా 2 లక్షల టన్నుల దిగుబడి వస్తోంది. పుత్తూరు, చిత్తూరు, తిరుపతి, బంగారుపాళెం మార్కెట్ యార్డులు ప్రభుత్వం నిర్వహిస్తోంది. దామలచెరువులో ప్రైవేట్ వ్యక్తులు నిర్వహిస్తున్నారు. ఈ యార్డుల ద్వారా ఏటా సుమారు రూ.400 కోట్ల మేర టర్నోవర్ జరుగుతోంది. ఇందులో సుమారు రూ.30 కోట్ల మేర మహారాష్ట్ర, రాజస్తాన్, కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలకు మామిడి రవాణా అవుతోంది. ఇంత భారీ స్థాయిలో దిగుబడులు అందిస్తున్న మామిడి తోటలను సంరక్షించుకొనే దిశగా రైతులను ప్రభుత్వం ప్రోత్సహించాల్సి ఉంది.

పురుగుల నివారణ ఇలా..



మామిడి సీజన్ పూర్తవగానే చెట్లను ఆశించే పురుగులు, బంక నుంచి రక్షించుకునే పనులు ప్రారంభించాలి. ప్రస్తుతం మామిడి పంటను ఆశిస్తున్న పురుగుల్లో ప్రధానమైనది గూడు పురుగు. ఈ పురుగు సాధారణంగా 30 నుంచి 40 ఏళ్ల మామిడి చెట్లను ఆశిస్తాయి. ఇలా గూడు పురుగు సోకిన కొమ్మలను కత్తిరించి, దూరంగా తీసుకెళ్లి కాల్చివేయాలి. తర్వాత గూడు పురుగు నివారణకు క్వినోల్‌ఫాస్ మందు 2 మిల్లీ లీటర్లను ఒక లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలి. కాండం తొలిచే పురుగు నివారణకు సెలోపాస్ అనే మాత్రను పురుగు తొలిచిన కాండం భాగంలో గానీ, బెరడు భాగంలో గాని ఉంచి మట్టితో కప్పేయాలి. దీంతో పురుగు లోపలి భాగంలోనే చనిపోతుంది. కాండం, కొమ్మలపైన గమ్మోసిస్ బంక కారడాన్ని ప్రధానంగా నివారించాలి. ఇందుకు బెరడును తీసివేసి కాపర్ ఆక్సిక్లోరైడ్ (సీఓసీ) 5 గ్రాముల మందును ఒక లీటరులో కలిపి బ్రష్‌తో తాపడం చేయాలి. పురుగుల నుంచి బంక నుంచి చెట్లను కాపాడుకోవడం ద్వారా మంచి దిగుబడిని పొందవచ్చు.

– బి. దశరథరామిరెడ్డి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి, తిరుపతి

శిలాఫలకాలు కనుమరుగు


ఎంపీడీవో కార్యాలయంలో ఫిర్యాదు ఇస్తున్న సర్పంచ్, వార్డుమెంబర్లు

గంగవరం: మండలంలోని మారేడుపల్లెలో సచివాలయం శిలాఫలకాలకు టీడీపీ నాయకుడు పెయింట్ వేసి కనుమరుగుచేయడంపై మండలంలోని ప్రజాప్రతినిధులు, సర్పంచ్ చంద్రమ్మ, వార్డు సభ్యులు కలిసి సోమవారం ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేశారు. వెంటనే శిలాఫలకాలకు వేసిన పెయింట్ తొలగించాలని డిమాండ్ చేశారు. మారేడుపల్లెలో గత ప్రభుత్వం నిర్మించిన సచివాలయ శిలాఫలకాలకు పూర్తిగా పెయింట్ వేసి పూర్తిగా కనుమరుగు చేయడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

జాతీయ విపత్తుగా ప్రకటించాలి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): విజయవాడ వరదలను కేంద్రం జాతీయ విపత్తుగా ప్రకటించి, రూ.7 కోట్ల మేర నష్ట పరిహారం ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ తులసిరెడ్డి డిమాండ్ చేశారు. చిత్తూరు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విజయవాడలో బుడమేరు వల్ల కనీవినీ ఎరుగని రీతిలో వరద ముంచెత్తిందన్నారు. ఆ ప్రాంతంలో తీవ్రనష్టం వాటిల్లిందన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి రూ.7కోట్లు విడుదల చేసి, జాతీయ విపత్తుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. టీడీపీ గెలుపునకు ప్రధాన కారణం సూపర్ సిక్స్ అన్నారు. అయితే అందులో సామాజిక పింఛన్లు మాత్రమే అమలుచేశారన్నారు. మిలిగిన ఐదు హామీలను పట్టించుకోవడం లేదని చెప్పారు.

'మెంటల్ హెల్త్'పై బ్రోచర్ ఆవిష్కరణ


బ్రోచర్ ఆవిష్కరణలో నిర్వాహకులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని మురకంబట్టు అపోలో యూనివర్సిటీలో ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లో భాగంగా మెంటల్ హెల్త్ మ్యాటర్స్ అట్ వర్క్ అనే అంశంపై అక్టోబర్ 9, 10 తేదీల్లో చర్చా కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైస్ చాన్సలర్ డాక్టర్ వినోద్ భట్ తెలిపారు. సోమవారం మధ్యాహ్నం అపోలో యూనివర్సిటీలో దీనికి సంబంధించిన బ్రోచర్‌ను ఆయన విడుదల చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దీనికి సంబంధించి అక్టోబర్ 5 నుంచి 8వ తేదీ వరకు ప్రీ కాన్ఫరెన్స్ ఈవెంట్స్‌లో భాగంగా అవగాహన ర్యాలీతో పాటు, మూడు రోజులు సైకాలజీ ఎగ్జిబిషన్ నిర్వహిస్తామన్నారు. 9, 10 తేదీల్లో ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌కు ముఖ్య వక్తలుగా కెనడా నుంచి మధు భరద్వాజ్, ఆఫ్రికా నుంచి డాక్టర్ సంద్రా జుంబే, నేపాల్ నుంచి డాక్టర్ నరేంద్ర సింగ్ తగుణ, మరి కొంతమంది వక్తలు పాల్గొంటారన్నారు. పదవ తేదీ ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులచే పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. స్కాలర్లు, విద్యార్థులు, ప్రముఖ వైద్యులు, వక్తలు, ఆచార్యులు, అధ్యాపకులు, పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఎం పోతరాజు, డీన్ డాక్టర్ కే భాస్కర్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎస్ హసీనా, జాయింట్ సెక్రటరీ డాక్టర్ పి సుధ, కో–ఆర్డినేటర్లు డాక్టర్ కబిలాన్ అన్నాదురై, డాక్టర్ సుబ్రమణ్యం, డాక్టర్ విజయ్ పాల్గొన్నారు.

కబేళాలలో కాసుల వర్షం

- లేగదూడలను తరలిస్తున్న వైనం
- పట్టించుకోని అధికార యంత్రాంగం


పుంగనూరు: పశువులను మినీలారీలో కబేళాలకు తరలిస్తున్న దృశ్యం

పుంగనూరు: గోవధ నేరమంటూ ప్రభుత్వాలు ప్రకటనలు గుప్పిస్తున్నా, తమకేమి పట్టనట్లు వ్యాపారులు అధికార పార్టీ అండతో గోవులను, లేగదూడలను కబేళాలకు తరలిస్తూ కాసులవర్షం కురిపించుకుంటున్నారు. ఈ విషయంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పుంగనూరులో ప్రతి మంగళ, బుధవారాల్లో పశువుల సంత నిర్వహిస్తారు. సంతలో సుమారు 15 వేల పశువులు క్రయ విక్రయాలు సాగుతున్నాయి. అయితే పశువుల సంతకు పుంగనూరు, మదనపల్లె, రాయలపేట, పలమనేరు, తమిళనాడుకు చెందిన వ్యాపారులతో పాటు రైతులు తరలివస్తారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులకు అవసరమైన పశువులను కొనుగోలు చేసుకుని వెళ్తారు. మిగిలిన పశువులను కబేళాలకు తరలించేందుకు వ్యాపారులు పోటీ పడుతారు. పశువులకు అధిక ధరలు చెల్లించి, లేగదూడలు, బర్రెలను సైతం కబేళాల కోసం తరలిస్తారు. సుమారుగా 40 నుంచి 50 లారీల పశువులను ప్రతి వారం కబేళాలకు తరలిస్తారు.

కాసుల వర్షం

పశువులను కబేళాలకు తరలించే సమయంలో అధికార పార్టీకి చెందిన వారు కొంత మంది మద్దతు ఇవ్వడంతో వ్యాపారులకు మార్గం సుగమమైంది. ఒక్కొక్క లారీలో 6 నుంచి 10 పశువులను వేయాల్సి ఉండగా పదుల సంఖ్యలో ఆవులను వేసి తరలిస్తున్నారు. లారీలకు టార్పాలిన్, పట్టలు కట్టి గూడ్స్ లారీల్లో తరలించినట్లు పశువులను కబేళాలకు తరలిస్తున్నారు. నియంత్రించాల్సిన పోలీస్, వెటర్నరీ, మార్కెట్ కమిటీ ఉద్యోగులు సైతం తమకేమీ పట్టనట్లు ప్రవర్తించడంతో పశువుల వధ తీవ్రమైంది.

ఎటుచూసినా దుకాణాలు

పట్టణంలోని పలు ప్రాంతాల్లో పశువులను యథేచ్ఛగా వధించి వాటి మాంసంతో దుకాణాలు, బిరియానీ సెంటర్లు ఏర్పాటు చేశారు. పశువధ పుంగనూరులో విచ్చలవిడిగా సాగుతోంది. చర్యలు తీసుకోవాల్సిన మున్సిపల్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో మాంసం వ్యాపారం జోరుగా సాగుతోంది.

గోవధ నిషేధించాలి

పుంగనూరులో గోవధ తీవ్రంగా జరుగుతోందని, ప్రతి వారం వేలాది పశువులను కబేళాలకు తరలిస్తున్నా, అధికారులు పట్టించుకోవడం లేదని అఖిల భారత గోరక్షణ మహాసంఘ్ కార్యదర్శి అయూబ్‌ఖాన్ మండిపడ్డారు. ఆయన మాట్లాడుతూ 2002 జాతీయ కమిషన్ సూచించిన సిఫార్సులను అమలు చేయాలని, కబేళాలను సీజ్ చేయాలని, గోకుల మిషన్‌ను బలోపేతం చేసి, దేశీయ ఆవులను పెంపొందించేందుకు రైతులను భాగస్వాములు చేయాలన్నారు. కబేళాలకు తరలించే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, గోవులను కాపాడాలని కోరారు.

గ్రానైట్ లారీ సీజ్


పోలీసులు సీజ్ చేసిన లారీ

పాలసముద్రం : అక్రమంగా తమిళనాడుకి గ్రానైట్ రాళ్ల తరలిస్తున్న గ్రానైట్ రాళ్ల తీసుకెళుతున్న లారీని సోమవారం ఉదయం బలిజకండ్రిగలో సీజ్ చేసినట్లు ఎస్ఐ భారతి తెలిపారు. ఆమె మాట్లాడుతూ తమిళనాడు నుంచి అక్రమంగా గ్రానైట్ రాళ్ల తరలిస్తున్నారని సమాచారం మేరకు, నిఘా పెట్టి ఈ లారీని సీజ్ చేసినట్లు వివరించారు. లారీలో టార్పాలిన్ కప్పి 17 గ్రానైట్ రాళ్లను తరలిస్తున్నట్లు చెప్పారు. ఈ లారీని సీజ్ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రైలు పట్టాలపై వ్యక్తి మృతి


రైలు పట్టాలపై పడి మృతి చెందిన మున్సిహేమ్రాన్

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక బండపల్లె రైల్వే పట్టాలపై పడి యువకుడు మరణించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రైల్వే ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం, పశ్చిమ బెంగాల్‌లోని బోల్పూర్‌కు చెందిన మున్సిహేమ్రాన్ (32) బెంగళూరులో సెంట్రింగ్ పనులు చేస్తుండేవారని చెప్పారు. హౌరా–యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలులో శుక్రవారం ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు పట్టాలపై పడి మృతి చెందినట్లు భావిస్తున్నారు. మృతుడు పనిచేసే సంస్థ యజమాని సమాచారం ఇచ్చినట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

మహిళా మార్ట్‌ల మూసివేతకు కుట్ర


పుంగనూరులో జగనన్న మార్ట్‌ను ప్రారంభిస్తున్న అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి (ఫైల్)

పుంగనూరు: మహిళల భాగస్వామ్యంతో వ్యాపార రంగంలో వారిని అభివృద్ధి చేసేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్న మహిళా మార్ట్‌లను, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఏర్పాటు చేసింది. ఈ మహిళా మార్ట్‌ను 2021లో తొలిసారిగా వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల్లో ప్రారంభించారు. అలాగే 2022 మార్చి 29న మాజీ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పుంగనూరులో ప్రారంభించారు. ఇందులో ప్రతి మహిళ రూ.300 భాగస్వామ్యంతో సుమారు పదివేల మంది సభ్యులతో రూ.30 లక్షలు పెట్టుబడిగా మహిళా మార్ట్‌లను నిర్వహిస్తూ అధిక లాభాలు ఆర్జిస్తున్నారు. మహిళలను వ్యాపార రంగంలో భాగస్వాములు చేయడంతో మహి జగనన్న మహిళా మార్టుల ద్వారా ఆర్థిక ప్రగతి సాధించారు. మహిళలు వ్యాపార రంగంలో ముందుకు దూసుకుపోతుంటే వైఎస్సార్‌సీపీకి మంచిపేరు వస్తుందన్న విషయాన్ని గ్రహించిన అధికార ప్రభుత్వం జగనన్న మహిళా మార్ట్‌లు మూసివేసేందుకు రంగం సిద్ధం చేసింది. ఇందులో భాగంగా జగనన్న మహిళా మార్ట్‌లలో వ్యాపారాలు సక్రమంగా లేవంటూ తప్పుడు రికార్డులు సృష్టించింది. అందులో భాగంగానే మహిళా మార్ట్‌లను మూసివేసేందుకు ఆయా కమిషనర్లకు ఫిర్యాదులు అందజేస్తున్నారు. పుంగనూరు మున్సిపాలిటీలో మహిళా మార్ట్‌లు మూసివేసేందుకు రంగం సిద్ధం చేశారు. దీనిపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వ్యాపార రంగంలో మహిళలను ప్రోత్సహించాల్సిన ప్రభుత్వం ఇందుకు విరుద్ధంగా మహిళా మార్ట్‌లను మూసివేసేందుకు చర్యలు తీసుకోవడంపై మండిపడుతున్నారు.

మెనూలో మార్పులకు సూచనలివ్వండి

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ బడుల్లో అమలవుతున్న మధ్యాహ్నభోజనం మెనూలో మార్పులు, చేర్పులపై క్షేత్రస్థాయిలో పరిశీలించి సూచనలివ్వాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. ఆయన సోమవారం కలెక్టరేట్‌లో విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజనం మెనూపై సమగ్రంగా పరిశీలన చేయాలన్నారు. విద్యార్థులు ఏఏ రోజుల్లో బాగా తింటున్నారు, ఏఏ రోజుల్లో తినడం లేదన్న విషయాలను గమనించాలని తెలిపారు. 20 మంది హెచ్‌ఎంలు, 20 మంది వంట మనుషులను బృందంగా ఏర్పాటు చేసి పరిశీలన చేయించాలన్నారు. ప్రభుత్వ బడుల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం మెనూ మార్పుపై ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేసిన తర్వాత రెండు రోజుల్లో సమగ్రమైన నివేదికను విద్యాశాఖ అధికారులకు అందజేయాలని తెలిపారు. ఈ సమావేశంలో డీఈఓ దేవరాజు, సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి, ఏడీ వెంకటేశ్వరరావు, ఎంఈఓలు రమేష్, మోహన్, సెల్వరాజ్, తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు సహకరించండి


ఎస్పీని సన్మానిస్తున్న ముస్లింలు

రామకుప్పం: మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని జిల్లా ఎస్పీ మణికంఠ అన్నారు. పీస్ కమిటీ సభ్యులతో సోమవారం ఆయన సమావేశమయ్యారు. మండల పరిధిలో ఏవైనా అనుకోని సంఘటనలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ప్రజలు సంమయనం పాటించి పోలీసులకు సహకరించాలన్నారు. రామకుప్పంలో సుబ్రమణ్యస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల్లో ఎస్పీ దంపతులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక మసీదులో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ దంపతులను ముస్లిం సోదరులు సన్మానించారు.

శ్మశాన స్థలం ఆక్రమణపై యానాదుల ధర్నా


తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న యానాదులు

బంగారుపాళెం: అగ్రవర్ణానికి చెందిన ఓ వ్యక్తి యానాదుల స్మశాన స్థలాన్ని ఆక్రమించుకుని తమపై దౌర్జన్యం చేశాడని మొగిలికి చెందిన గిరిజనులు(యానాదులు)సోమవారం రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. బాధితుల కథనం మేరకు, మండలంలోని మొగిలి గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 61లో ఊరగుట్ట ఉంది. ఆ భూమిలో గత కొన్నేళ్లుగా యానాదులైన తాము మేకలు, గొర్రెలు, పశువులు మేపుకుంటున్నారు. ఆ భూమిలో పండే అటవీ ఫలసాయాన్ని సేకరించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సదరు భూమిలో కొంత భాగాన్ని శ్మశానంగా వినియోగించుకుంటున్నారు. మొగిలి దొరచెరువు వద్ద నివాసముటున్న అగ్రకులానికి చెందిన ఏకాంబరంనాయుడు ఈ నెల 7వ తేదీ దౌర్జన్యంగా శ్మశాన స్థలాన్ని ఆక్రమించుకుని బోరు వేసి పైప్‌లైన్ పనులు మొదలెట్టారు. పనులను అడ్డుకుని ప్రశ్నిస్తే కులం పేరుతో దూషిస్తూ దౌర్జన్యం చేశారు. వారు సాగుచేసుకుంటున్న భూములను ఏకాంబరం నాయుడి కుటుంబ సభ్యులు, బంధువుల పేరు మీద డీకేటీ పట్టా చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ విషయంపై పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేదని వారు వాపోయారు. ఏకాంబరంనాయుడు మొగిలి ఘాట్ చుట్టుపక్కల సుమారు 20 ఎకరాలకు పైగా డీకేటీ పట్టాలు పొందినట్లు వారు వెల్లడించారు. నిరుపేదలైన ఎస్టీలు సాగుచేసుకుంటున్న భూములతో పాటు, శ్మశాన స్థలాన్ని ఆక్రమించుకున్నట్లు వాపోయారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

మద్యం మత్తులో వ్యక్తి మృతి

కదిరి అర్బన్ (సత్యసాయి జిల్లా): అతిగా మద్యం సేవించి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం నెలపట్ల గ్రామానికి చెందిన రమేష్ (34) తన మేనల్లుడు సతీష్‌తో కలసి కొన్నేళ్ల క్రితమే వలస వచ్చి కుమ్మరవాండ్లపల్లిలో స్థిరపడ్డాడు. గ్రామాల్లో తిరుగుతూ స్టీల్, సిల్వర్ సామగ్రి విక్రయించి జీవనం సాగించేవారు. ఈ క్రమంలో కొన్ని నెలల క్రితం సతీష్ వేరుపడి సొంతంగా వ్యాపారం మొదలు పెట్టాడు. చిన్నప్పటి నుంచి తన వద్ద పెరిగిన మేనల్లుడు వదలి వేరుగా వ్యాపారం చేస్తుండడంతో మనస్తాపం చెందిన రమేష్ ఆదివారం రాత్రి అతిగా మద్యం సేవించి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. సోమవారం తెల్లవారుజామున విషయాన్ని గమనించిన ఆయన భార్య రమ్య వెంటనే కదిరి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లింది. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. రమ్య ఫిర్యాదు మేరకు కదిరి రూరల్ అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ మోహన్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వినాయక ఉత్సవంలో ఘర్షణ

విజయపురం : మండలంలోని పన్నూరు సబ్‌స్టేషన్ వద్ద వినాయక ఉత్సవంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ సంఘటనలో పన్నూరు దళితవాడకు చెందిన వీరా (25) తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు, పన్నూరు సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన వినాయక ఉత్సవంలో ఒక వర్గం అన్నదానం చేసింది. పన్నూరుకు చెందిన మరో వర్గం కూడా అన్నం పెట్టాలని కోరారు. త్వరగా పెట్టండి అంటూ ప్రశ్నించడంతో వాగ్వాదం మొదలైంది. ఇది క్రమంగా ఇరు వర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. ఈ మేరకు ఏఎస్ఐ గోవిందం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.